రుణం కోసం పోయి హఠాన్మరణం

- కొత్త లోన్‌కు వెళ్లగా భారీ క్యూ
- లైన్‌లోనే రైతుకు గుండెపోటు
- నారాయణపేట జిల్లాలో ఘటన

కతలప్ప (ఫైల్)

మద్దూర్ (కొత్తపల్లి), ఆగస్టు 23 : రుణం కోసం వచ్చిన ఓ రైతు గుండెపోటుతో బ్యాంకు వద్ద మరణించాడు. ఈ ఘటన నారాయణపేట జిల్లా మద్దూర్‌లో శుక్రవారం చోటుచేసుకున్నది. స్థానికుల కథనం మేరకు.. మద్దూరు మండలం బొమ్మన్‌పహాడ్‌కు చెందిన రైతు గవినోళ్ల కతలప్ప అలియాస్ అబ్బాస్ (50) శుక్రవారం మద్దూర్ మండల కేంద్రంలోని ఎస్‌బీఐకి రుణం కోసం వచ్చాడు. బ్యాంకులో చాలామంది ఉండటంతో క్యూలో నిలబడ్డాడు. ఈ సమయంలో ఒక్కసారిగా కింద పడిపోగా.. స్థానికులు స్థానిక ప్రభుత్వ దవాఖానకు తరలించారు. అప్పటికే గుండెపోటుతో మరణించినట్టు వైద్యులు తెలిపారు. కతలప్పకు భార్య గోవిందమ్మ, ఇద్దరు కూతుళ్లు, కుమారుడు ఉన్నారు. కొత్తగా రుణం కోసం కొన్నిరోజులుగా బ్యాంకు చుట్టూ తిరుగుతున్నట్టు వారు తెలిపారు.

యాదాద్రి జిల్లాలో మరో రైతు...

పొలిమెర గోపాల్ (ఫైల్)

రామన్నపేట, ఆగస్టు 23 : డబ్బులను డ్రా చేసుకునేందుకు బ్యాంకుకు వెళ్లిన రైతు గుండెపోటుతో మృతిచెందాడు. కుటుంబ సభ్యులు, బంధువులు తెలిపిన వివరాల ప్రకారం.. యాదాద్రి భువనగిరి జిల్లా రామన్నపేట మండలం ఇస్కిళ్ల గ్రామానికి చెందిన పొలిమెర గోపాల్ (72)కు గ్రామంలో మూడెకరాల 35 గుంటల భూమి ఉన్నది. ఆయనకు భార్య, ఐదుగురు కుమారులు, కుమార్తె ఉన్నారు. ఇటీవల లక్షా 35 వేలు మాఫీ అయ్యాయి. ఆయన బ్యాంకు ఖాతాలో 80 వేలు ఉండగా.. పెద్ద కుమారుడి ఖాతాకు బదిలీ చేయించేందుకు కుమారుడితో కలిసి మునిపంపులలోని యూనియన్ బ్యాంక్‌కు వచ్చాడు. డబ్బును బదిలీ చేయించేందుకు పక్కనే ఉన్న పరిచయస్తుడితో ఓచర్ రాయాలని చెప్పి కుర్చీ మీద కూర్చున్నాడు. అంతలోనే నొప్పిగా ఉన్నదని మాట్లాడుతూనే కింద పడిపోయాడు. పక్కనే ఉన్న యువకుడు సీపీఆర్ చేసినా ఫలితం లేకుండా పోయింది. 108 సిబ్బంది వచ్చి పరీక్షించగా అప్పటికే మృతి చెందినట్టు కుటుంబ సభ్యులు తెలిపారు.

మా గోస వినేదెవరు?..

ప్రభుత్వం రుణమాఫీ చేసినట్టు చెప్పింది. తమకేమో మాఫీ కాలే. ఏమైందో తెలుసుకునేందుకు ఆఫీసుకొస్తే ఇక్కడ పట్టించుకునేటోళ్లే లేరని రైతులు వాపోయారు. పొద్దుగల్ల నుంచి ఇక్కడే ఉన్నా ఎవరూ తమ గోస పట్టించుకోవడం లేదంటూ నిజామాబాద్ జిల్లా భీమ్‌గల్‌లోని మండల వ్యవసాయ శాఖ కార్యాలయం ఎదుట నిరసనకు దిగారు. మాఫీ కాని రైతులు మండల కార్యాలయాల్లో దరఖాస్తు చేసుకోవాలని ప్రభుత్వం చెప్పడంతో రైతులు శుక్రవారం ఉదయమే ఆఫీసుకొస్తే ఎవరూ లేరు. 11 గంటలు దాటినా అధికారులు, సిబ్బంది రాకపోవడంతో అసహనానికి గురైన రైతులు నిరసన తెలిపారు. తమ గోస ఎవరితో చెప్పుకోవాల్నో అర్థమైతలేదని భీమ్‌గల్ మండలం కారేపల్లికి చెందిన మహిళా రైతు గుగ్లోత్ జెన్ను ఆవేదన వ్యక్తంచేసింది. -భీమ్‌గల్

షరతులు లేకుండా రుణమాఫీ చేయాలి

ఎలాంటి షరతులు లేకుండా రైతులందరికీ రూ.2 లక్షల రుణమాఫీ చేయాలని రైతు సంఘం రాష్ట్ర నాయకుడు గొల్లపల్లి జయరాజు కాంగ్రెస్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు తెలంగాణ రైతు సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం సంగారెడ్డి కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. అనంతరం కలెక్టరేట్ ఏవో పరమేశ్‌కు వినతి పత్రం అందజేశారు. తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర నాయకుడు, సీపీఎం జిల్లా కార్యదర్శి జయరాజు మాట్లాడుతూ.. ఒక్క సంగారెడ్డి జిల్లాలోనే 2.50 లక్షల మంది రైతులు ఉంటే.. ఇప్పటి వరకు మూడు విడతల్లో కేవలం 97,873 మందికి మాత్రమే రూ.846.31 కోట్ల రుణమాఫీ అయిందని వివరించారు. సాంకేతిక సమస్యలను వెంటనే పరిష్కరించి రైతులకు రుణమాఫీ చేసి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. - సంగారెడ్డి కలెక్టరేట్

రుణమాఫీ కోసం రోడ్డెక్కిన రైతులు

రైతులందరికీ రుణమాఫీ చేయాలని డిమాండ్ చేస్తూ శుక్రవారం సిద్దిపేట జిల్లా చేర్యాలలో ఎస్‌బీఐ ఎదుట రైతులు రోడ్డుపై ధర్నా చేశారు.రూ.2 లక్షల రుణాన్ని మాఫీ చేస్తానని అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్.. కొంతమందికే మాఫీ చేసిందని ఆవేదన వ్యక్తంచేశారు. -చేర్యాల

ముఖ్యమంత్రి మాటలన్నీ అబద్ధాలే

అర్హులైన రైతులందరికీ రూ.2 లక్షల రుణమాఫీ చేయాలని సీపీఎం బోనకల్లు మండల కమిటీ ఆధ్వర్యంలో స్థానిక తహసీల్దార్ కార్యాలయం ఎదుట శుక్రవారం ధర్నా చేపట్టిన సీపీఎం ఖమ్మం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు చింతలచెరువు కోటేశ్వరరావు, బోనకల్లు మండల కార్యదర్శి దొండపాటి నాగేశ్వరరావు తదితరులు - బోనకల్లు

బ్యాంకుల్లో రుణమాఫీ టోకెన్ క్యూ

లైన్‌లో తోపులాట.. వృద్ధురాలికి గాయం

నర్సింహులపేట, ఆగస్టు 23: మహబూబాబాద్ జిల్లా నర్సింహులపేట మండల కేంద్రంలోని ఎస్‌బీఐ పరిధిలో రూ.2 లక్షల లోపు రుణం తీసుకున్న రైతులు సుమారు 2800 మంది ఉంటే.. 1200 మందికి మాత్రమే మాఫీ అయ్యింది. బ్యాంకు అధికారులు ఆడిట్ పేరుతో 20 రోజులుగా రుణమాఫీ వచ్చిన వారికి డబ్బులు ఇవ్వకపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. రోజుకు 30 మంది రైతులకు మాత్రమే రుణమాఫీ చేస్తామని అధికారులు టోకెన్లు ఇస్తుండటంతో.. శుక్రవారం వివిధ గ్రామాల నుంచి రైతులు పెద్ద సంఖ్యలో వచ్చారు. దీంతో బ్యాంకు వద్ద ఒక్కసారిగా తోపులాట జరిగి రామన్నగూడెం గ్రామానికి చెందిన 68 ఏండ్ల వృద్ధురాలు మంద సోమక్క గాయపడింది. తలకు గ్రిల్ తగలడంతో రక్తస్రావం జరిగింది. ఇంత జరుగుతున్నా బ్యాంకు అధికారులు పట్టించుకోవడం లేదని రైతులు మండిపడుతున్నారు.

మహబూబాబాద్ జిల్లా నర్సింహులపేట ఎస్‌బీఐలో టోకెన్ కోసం క్యూ కట్టిన రైతులు

పైసలేమోగానీ.. నా ప్రాణం పోతుండే

బ్యాంకులో తీసుకున్న లోన్ మాఫీ అయిందని నా కొడుకుతో కలిసి బ్యాంకుకు వచ్చిన. ఇక్కడ శాన మంది ఉండటంతో నేను లైన్ల నిలబడిన. బ్యాంకు వాళ్లు వచ్చి తలుపు(షటర్) తీయడంతో ఒక్కసారిగా నెట్టుకున్నారు. దీంతో నా తల ఇనుప కడ్డీకి(గ్రిల్)కు తగిలింది. రక్తం వచ్చినా ఎవరూ పట్టించుకోలేదు. ఏం చేయాలో అర్థం కాలేదు. పైసలు తీసుకునుడేమో కాని కొద్దిగైతే నా ప్రాణం పోతుండే. గాయపడిన నన్ను నా కొడుకు దవాఖానకు తీసుకపోయిండు.
-మంద సోమక్క, రైతు, రామన్నగూడెం

రైతులను చీదరించుకుంటున్నారు

లోన్ పైసలు వచ్చినయని సంబురంగ బ్యాంకుకు వచ్చిన. ఇక్కడ చూస్తే శాన మంది ఉన్నారు. బ్యాంకు అధికారులు, సిబ్బంది రైతులను చూసి చీదరించుకున్నారు. ఏదో వాళ్ల ఇంట్లో నుంచి పైసలు ఇచ్చినట్టు చూస్తున్నారు. ఓ పేపరు మీద ముద్ర వేసి మంగళవారం (ఈ నెల 27న) రమ్మని చెప్పారు. అధికారులు వాళ్ల ఆడిట్ కోసం 20 రోజుల సంది మా పైసలు ఇవ్వకుండా ఇప్పుడు మళ్ల మంగళవారం రమ్మని చెబుతున్నారు. అధికారులు రైతుల బాధలు తీర్చాలి. -బానోతు రాంసింగ్, రైతు, బాసుతండా

'మూగ'వేదనైనా ఆలకించరూ..!

- మూగజీవాల విషయంలో సర్కార్ మొద్దునిద్ర వీడాలి
- 1962 సంచార వైద్యసేవల్లో అంతరాయాన్ని నివారించాలి
- సీఎం రేవంత్‌రెడ్డికి మాజీమంత్రి హరీశ్‌రావు లేఖ

హైదరాబాద్, ఆగస్టు 23 (నమస్తే తెలంగాణ): పశువైద్యశాలల్లో మందుల కొరత, 1962 పశువైద్య సంచార వాహన సేవల్లో అంతరాయం.. అయినా మూగజీవాల మానరోదనను ప్రభుత్వం పట్టించుకోవటం లేదని మాజీ మంత్రి హరీశ్‌రావు ఆరోపించారు. రాష్ట్రంలో పశుసంవర్ధక శాఖలో నెలకొన్న పరిస్థితులపై ఆయన సీఎం రేవంత్‌రెడ్డికి లేఖ రాశారు. రాష్ట్రంలో ఆవులు, బర్రెలు, గొర్రెలు, మేకలకు వ్యాధులు సోకితే తగిన వైద్యం అందించేందుకు ప్రభుత్వ పశువైద్యశాలల్లో మందులు లేని దుస్థితి నెలకొన్నదని తెలిపారు. నట్టల నివారణ మందులు సరఫరా చేయకపోవటంతో కాలేయం, జీర్ణాశయం, పేగుల్లో పరాన్నజీవులు చేరి రక్తహీనతకు గురవుతున్నాయని వివరించారు.

దేశానికే ఆదర్శంగా 1962

మూగజీవాల వద్దకే వైద్యసిబ్బంది వచ్చి చికిత్స అందించేందుకు బీఆర్ఎస్ ప్రభుత్వం ఏర్పాటు చేసిన 1962 పశువైద్య సంచార వాహనాలు దేశానికి ఆదర్శంగా నిలిచాయని హరీశ్‌రావు గుర్తుచేశారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన నాటి నుంచి ఇప్పటివరకు పశు సంవర్ధకశాఖపై సమీక్షించలేదని దుయ్యబట్టారు. వానకాలంలో వ్యాధులు ఎక్కువగా వచ్చే అవకాశం ఉన్న నేపథ్యంలో సర్కార్ ఇప్పటికైనా నిర్లక్ష్యం వీడాలని అన్నారు.

చేపపిల్లల పంపిణీ ఏది?

గొర్రెల పంపిణీని అటకెక్కించిన ప్రభుత్వం చేపల పంపిణీని ఆలస్యం చేస్తున్నదని హరీశ్‌రావు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఉచిత చేపల పంపిణీ కోసం మత్స్యకారులు ఎదురుచూస్తున్నారని తెలిపారు. జూన్ నాటికి టెండర్లను పూర్తయ్యి ఆగస్టు నాటికి సగం చేపపిల్లలు చెరువుల్లోకి చేరేవని, కానీ, ఇంకా ఆ ప్రక్రియ టెండర్ దశలోనే ఉండటం అనుమానాలకు తావిస్తున్నదని వెల్లడించారు.

నేడు ఆర్మూర్‌లో 'రుణమాఫీ' మహాధర్నా

మోర్తాడ్, ఆగస్టు 23: నిజామాబాద్ జిల్లా బాల్కొండ, ఆర్మూర్, నిజామాబాద్ రూరల్ నియోజకవర్గాల రైతులు రైతు ఐక్యకార్యాచరణ కమిటీగా ఏర్పడి రుణమాఫీ హామీల అమలు కోసం శనివారం తలపెట్టిన మహాధర్నాను విజయవంతం చేసేందుకు తీర్మానాలు చేస్తున్నాయి. ఆర్మూర్ ఏసీపీ బస్వారెడ్డి అనుమతి ఇచ్చారని ఐక్య కార్యాచరణ కమిటీ ఇన్‌చార్జి ఇట్టడి లింగారెడ్డి తెలిపారు. కాగా చలో ఆర్మూర్, రాస్తారోకో కార్యక్రమానికి అనుమతులు ఇవ్వలేదని సీపీ కల్మేశ్వర్ తెలిపారు. ఆర్మూర్‌లో ఈ నెల 23 సాయంత్రం నుంచి 25 ఉదయం 6 గంటల వరకు నిషేధాజ్ఞలు అమల్లో ఉంటాయని చెప్పారు. సమావేశాలు, రాస్తారోకోలు నిర్వహిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

బ్యాంకుల వద్ద రైతుల పడిగాపులు

రుణమాఫీ కాని రైతులు వ్యవసాయ అధికారుల చుట్టూ తిరుగుతుండగా, మాఫీ అయినవారు రెన్యూవల్ కోసం బ్యాంకుల వద్ద పడిగాపులు కాస్తున్నారు. శుక్రవారం ఆదిలాబాద్ జిల్లా ఇచ్చోడలోని తెలంగాణ గ్రామీణ బ్యాంకు లోపలికి ఒక్కొక్కరినే అనుమతించడంతో బ్యాంకు బయటే రైతులు గంటల తరబడి నిలబడ్డారు. - ఆదిలాబాద్ ఫొటోగ్రాఫర్

పైసా వసూల్‌పై రైతుల నిరసన

'ఏ పని కావాలన్నా పైసలు అడుగుతున్నారు.. ఇవ్వకుంటే బయటకు పొమ్మంటున్నరు' అంటూ శుక్రవారం కామారెడ్డి జిల్లా నాగిరెడ్డిపేట తహసీల్దార్ కార్యాలయం ఎదుట బైఠాయించిన రైతులు. తాము నేరుగా వెళ్తే ఏ పని చేయడం లేదని, దళారులతో వెళ్తేనే పని చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు - నాగిరెడ్డిపేట

రుణమాఫీ చేయకుంటే 'స్థానికం'గా ఓడిస్తాం

పంట రుణాన్ని వెంటనే మాఫీ చేయాలని, లేకుంటే స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్‌ను ఓడిస్తామని నిర్మల్ జిల్లా కుంటాలలో తహసీల్దార్, వ్యవసాయ కార్యాలయాల ఎదుట ధర్నా చేపట్టిన పెంచికల్‌పాడ్‌కు చెందిన రైతులు - కుంటాల/కుభీర్

హైదరాబాద్ ప్రజాభవన్ ఎదుట ధర్నా చేస్తున్న దళితబంధు రెండో విడత లబ్ధిదారులు

దళితబంధు రద్దు చేస్తే అగ్నిగుండమే

- ప్రభుత్వం రెచ్చగొడితే చావుడప్పు కొడతాం
- దళితబంధు సాధన సమితి రాష్ట్ర అధ్యక్షుడు మహేశ్
- ప్రజాభవన్ ఎదుట లబ్ధిదారుల ధర్నా

హైదరాబాద్, ఆగస్టు 23 (నమస్తే తెలంగాణ)/ఖైరతాబాద్: దళితబంధు రెండో విడుత లబ్ధిదారులకు తక్షణమే నిధులు విడుదల చేయాలని దళితబంధు సాధన సమితి రాష్ట్ర అధ్యక్షుడు కోగిల మహేశ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సమితి ఆధ్వర్యంలో శుక్రవారం హైదరాబాద్ ప్రజాభవన్ ఎదుట దళితబంధు రెండో విడుత లబ్ధిదారులు ధర్నా నిర్వహించారు. అధికారులకు వినతిపత్రం అందజేసిన అనంతరం మహేశ్ మీడియాతో మాట్లాడారు. గత ప్రభుత్వం ఎంపిక చేసిన లబ్ధిదారుల జాబితాను, పథకాన్ని రద్దుచేస్తే రాష్ట్రాన్ని అగ్నిగుండంగా మార్చుతామని హెచ్చరించారు. జాబితా నుంచి ఏ ఒక్క లబ్ధిదారుడి పేరు తొలగించినా ఊరుకోబోమని చెప్పారు. ప్రభుత్వం కవ్వింపు చర్యలకు పాల్పడితే రాష్ట్రవ్యాప్తంగా చావుడప్పు మోగిస్తామని హెచ్చరించారు. వారంరోజుల్లో దళితబంధు నిధులు జమ అవుతాయని ఖమ్మంలో డిప్యూటీ సీఎం భట్టి హామీ ఇచ్చి 15 రోజులవుతున్నా ఎలాంటి స్పందనా రాలేదని మండిపడ్డారు. దళితబంధు డబ్బు జమ చేయకుంటే స్థానిక సంస్థల్లో కాంగ్రెస్ పార్టీని దెబ్బ కొడతామని, ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. అంతకు ముందు ప్రజాభవన్‌కు ర్యాలీగా తరలివచ్చి ధర్నా నిర్వహించారు. దళితబంధు మంజూరు చేయాలని వినతిపత్రాలను ఇచ్చేందుకు వెళ్తే పట్టించుకునే నాథుడేలేడని తెలిపారు.

ప్రశ్నించిన టీచర్‌పై వేటు

- అసమగ్ర గురుకుల బదిలీలపై టీచర్ల ధర్నా
- సెక్రటరీ తీరును తప్పబడుతూ మాట్లాడిన ఉపాధ్యాయురాలి వీడియో వైరల్
- నోటీసులిచ్చి పిలిపించి సస్పెన్షన్ వేటు
- మరో 142మందికి సెక్రటరీ వార్నింగ్
- పరిష్కారానికి బదులు ప్రతీకారం
- సెలువు మంజూరు నిబంధనలూ మార్పు
- గురుకుల సొసైటీ సెక్రటరీ తీరును విమర్శిస్తూ ప్రజాభవన్‌లో ధర్నా

హైదరాబాద్, ఆగస్టు23 (నమస్తే తెలంగాణ): అడ్డదిడ్డంగా బదిలీలు చేశారు. జోన్లనే మార్చారు. పిల్లాపాపలకు దూరమై నానా గోసపడుతూ, మానసిక వేదనతో ఇదేమని అడిగితే ఇప్పుడు ఏకంగా సస్పెండ్ చేశారు. మరో 142 మంది టీచర్లకు సైతం వార్నింగ్ నోటీసులు జారీచేశారు. సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాలయాల సొసైటీ సెక్రటరీ తీరు ఇది. మానవీయ దృక్పథంతో స్పందించి సమస్యలను పరిష్కరించాల్సింది పోయి కక్షసాధింపులకు దిగడంతో టీచర్లు నివ్వెరపోతున్నారు. కోర్టు స్టే ఆర్డర్లను, ప్రభుత్వ ఆదేశాలను బేఖాతరు చేస్తూ 317జీవో బాధితులు, డిస్‌లొకేట్ అయిన గురుకుల ఉపాధ్యాయులను రాత్రికిరాత్రే రిలీవ్ చేసి కార్యాలయానికి రప్పించుకుని, ఆపై గ్రీవెన్స్ నిర్వహించకుండానే అప్పటికప్పుడు 177 మందికి పోస్టింగ్ ఇవ్వడం తెలిసిందే. అప్పటికే జోన్లు మారి, కుటుంబాలకు దూరంగా గడుపుతూ మానసికక్షోభను అనుభవిస్తున్న వారు సెక్రటరీ తీరును నిరసిస్తూ కార్యాలయం ఎదుటే బైఠాయించి నిరసనకు దిగారు. నినాదాలు చేశారు. సాయంత్రమైనా సెక్రటరీ స్పందించకపోవడంతో కార్యాలయంలోకి చొచ్చుకెళ్లి సెక్రటరీ చాంబర్ ఎదుట ధర్నాకు దిగారు. సెక్రటరీతో వాగ్వాదానికి దిగారు. సెక్రటరీ మానవీయ కోణంలో స్పందించి సమస్యను పరిష్కరిస్తారని భావిస్తే అదేమీ లేకుండానే వెళ్లిపోయారు. దీంతో టీచర్లందరూ అక్కడి నుంచి నేరుగా ప్రజాభవన్ వద్దకు వెళ్లి నిరసన తెలిపారు. మరోవైపు, కార్యాలయం వద్ద బైఠాయించి, నిరసన చేపట్టిన కార్యక్రమం మొత్తాన్ని అక్కడి సిబ్బంది వీడియో తీసి సొసైటీ సెక్రటరీ వర్షిణికి అందించారు. వీడియో ఫుటేజీల ఆధారంగా ఆమె ధర్నా తెలిపిన సిబ్బందిపై కక్షసాధింపులకు దిగారు. డిసిప్లినరీ యాక్షన్ పేరిట 142 మందికి నోటీసులు జారీ చేయాలని సంబంధిత పాఠశాలల ప్రిన్సిపాల్స్‌కు ఆదేశాలు జారీ చేశారు.

టీచర్‌పై అప్పటికప్పుడు వేటు

నిరసన కార్యక్రమంలో రంగారెడ్డి జిల్లా శంకర్‌పల్లి గురుకులంలో టీజీటీ సోషల్ విధులు నిర్వర్తిస్తున్న విజయనిర్మల కూడా పాల్గొన్నారు. సొసైటీ చేపట్టిన బదిలీలు, ప్రమోషన్లను తీవ్రంగా తప్పుబట్టారు. ఉన్నతాధికారుల తీరువల్లే తమకు అన్యాయం జరిగిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆమె మాట్లాడిన వీడియో సోషల్ మీడియాలో వైరల్ అయింది. దీంతో ఆమెకు రాత్రికి రాత్రే నోటీసు జారీచేశారు. శుక్రవారం ఉదయమే వచ్చి వివరణ ఇవ్వాలని ఆదేశించారు. శుక్రవారం సొసైటీ కార్యాలయానికి చేరుకున్న ఆమె వివరణ తీసుకోకుండానే ఏకపక్షంగా సస్పెండ్ చేశారు.

సెలవు మంజూరు నిబంధనల్లో మార్పు

సెలవుల మంజూరుకు సంబంధించిన నిబంధనలు సైతం మార్చివేస్తూ తాజాగా సెక్రటరీ ఉత్తర్వులు జారీచేశారు. ప్రిన్సిపాల్స్ నుంచి అధికారాలను కత్తిరించి జోనల్ ఆఫీసర్ల చేతిలో పెట్టారు. ఇప్పటివరకు ప్రిన్సిపాల్స్ 3 నెలల వరకు సెలవు తీసుకుంటే ఆర్సీవోల నుంచి, అంతకుమించి సెలవులను తీసుకోవాలనుకుంటే సెక్రటరీ నుంచి అనుమతులు పొందాల్సి ఉంటుంది. ప్రస్తుతం 5 రోజుల పాటు సెలవు కావాలంటే జాయింట్ సెక్రటరీ నుంచి, ఐదు నుంచి నెల రోజుల వరకు కావాలంటే అడిషనల్ సెక్రటరీ (అడ్మిన్), నెల నుంచి 6 నెలల వరకు సెలవు కావాలంటే సెక్రటరీ నుంచి అనుమతులు పొందేలా నిబంధనలు మార్చారు. టీచింగ్, నాన్‌టీచింగ్, సీనియర్ అసిస్టెంట్ కన్నా పై క్యాడర్ ఇప్పటి వరకు నెల రోజుల పాటు సెలవు కావాలంటే ప్రిన్సిపాల్, 6 నెలల వరకు కావాలంటే ఆర్సీవోలు, 6 నెలలకు మించి సెలవుపై వెళ్లాలనుకుంటే సెక్రటరీ అనుమతి పొందాల్సి ఉండేది. ప్రస్తుతం 5 రోజుల వరకు సెలవుకావాలంటే ప్రిన్సిపాల్ నుంచి, అంతకు మంచి నెలరోజుల వరకు కావాలంటే జోనల్, మల్టీ జోనల్ ఆఫీసర్ల నుంచి, నెలకు మించి సెలవు కావాలంటే టీచింగ్ స్టాఫ్ అడిషనల్ సెక్రటరీ (అడ్మిన్) నుంచి, మినిస్టీరియల్ స్టాఫ్ జాయింట్ సెక్రటరీ నుంచి అనుమతులను పొందేలా మార్చారు. ప్రిన్సిపాల్స్ అధికారాలకు కళ్లెంవేసి, ఆర్సీవోల అధికారాలను సొసైటీ మొత్తంగా తొలగించింది.

ప్రజాభవన్‌లో టీచర్ల వినతి

ఇటీవల సొసైటీ కార్యాలయంలో ధర్నా చేపట్టినా న్యాయం జరగకపోవడంతో అనేకమంది గురుకుల టీచర్లు, అధ్యాపకులు శుక్రవారం నేరుగా ప్రజాభవన్‌కు చేరుకున్నారు. తొలుత ప్రణాళిక సంఘం ఉపాధ్యాక్షుడు చిన్నారెడ్డిని కలిసి గోడు చెప్పుకున్నారు. 317జీవో, డిస్‌లోకేట్ సమస్యలపై సొసైటీ సెక్రటరీ వ్యవహరిస్తున్న తీరుపై ఫిర్యాదు చేశారు. అనంతరం ప్రజాదర్బార్ నోడల్ ఆఫీసర్ దివ్యా దేవరాజన్‌ను కలిసి మొరపెట్టుకున్నారు. న్యాయం చేయాలని కోరారు. అప్పటికీ ప్రభుత్వం నుంచి ఎలాంటి స్పష్టమైన హామీ రాకపోవడం గమనార్హం.

2లక్షలు ఇస్తరా? ఇవ్వరా?

- ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తున్న అంగన్‌వాడీ టీచర్లు

హైదరాబాద్, ఆగస్టు 23 (నమస్తే తెలంగాణ) : రాష్ట్రంలో అంగన్‌వాడీ కేంద్రాల్లో పని చేస్తూ 65ఏండ్లు నిండిన టీచర్లను, ఆయాలను ఉద్యోగాల నుంచి తొలగిస్తూ రెండు నెలల క్రితం ప్రభుత్వం నిర్ణయం తీసుకున్నది. ఉద్యోగ విరమణ పొందిన టీచర్లకు బెనిఫిట్స్ కిందరూ.2లక్షలు, ఆయాలకు రూ.లక్ష రిటైర్మెంట్ బెనిఫిట్స్ ఇస్తామని మాట ఇచ్చిన ప్రభుత్వం ఇప్పుడు నోరు మెదపడం లేదన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. బెనిఫిట్స్‌కు సంబంధించి ఎలాంటి జీవో విడుదల కాలేదని అంగన్‌వాడీ టీచర్లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రాష్ట్రంలో 35,700 అంగన్‌వాడీ కేంద్రాలు ఉండగా, వీటిల్లో పని చేస్తున్న టీచర్లు, ఆయాలకు వాస్తవానికి ఉద్యోగ విరమణ అనేది లేదు. బీజేపీ ప్రభుత్వం 2022లో 65 ఏండ్లు వచ్చేంత వరకు మాత్రమే ఈ కేంద్రాల్లో పని చేసేందుకు అర్హులుగా పరిగణిస్తూ రాష్ట్ర ప్రభుత్వాలకు ఆదేశాలు జారీ చేసింది. దీంతో రిటైర్మెంట్ అయిన 5వేల మంది ఉద్యోగ విరమణ పొంది రెండు నెలలైందని, తమకు ప్రభుత్వం నుంచి రావాల్సిన బెనిఫిట్స్ రాలేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తమను బలవంతంగా ఉద్యోగ విరమణ చేయించిన ప్రభుత్వం బెనిఫిట్స్ చెల్లించకుండా చోద్యం చూస్తున్నదని అంగన్‌వాడీ టీచర్లు మండిపడుతున్నారు.

దశలవారీగా 2 లక్షల పై రుణాలు మాఫీ

- కుటుంబ నిర్ధారణకు ప్రత్యేక యాప్ : మంత్రి తుమ్మల

హైదరాబాద్, ఆగస్టు 23(నమస్తే తెలంగాణ): రూ. 2 లక్షలకుపైగా రుణం ఉన్న రైతులకు దశలవారీగా మాఫీ చేస్తామని వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. శుక్రవారం ఆయన రుణమాఫీపై అధికారులుతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి తుమ్మల మాట్లాడుతూ.. రూ.2 లక్షలలోపు రుణం కలిగి, కుటుంబ నిర్ధారణ కాని రైతులు 4,24,873 మంది ఉన్నారని తెలిపారు. వీరిందరి వివరాలను సేకరించి కుటుంబ నిర్ధారణ చేసేందుకు ప్రత్యేక యాప్‌ను అందుబాటులోకి తీసుకొచ్చినట్టు తెలిపారు. వివిధ కారణాలతో రుణమాఫీ కాని రైతులు తమ వివరాలను ఇంటికి వచ్చే ఏఈవోకు గానీ, రైతు వేదికల్లో ఉండే ఏఈవోకు గాని అందజేయాలని సూచించారు. రూ.2 లక్షలలోపు రుణం కలిగి ఆధార్‌లో తప్పులతో రుణమాఫీకాని రైతులు 1,24,545 మంది ఉండగా వీరిలో 41,322 మంది సమస్యను పరిష్కరించినట్టు తెలిపారు. మిగిలిన 83,223 మందికి ఇంకా రుణమాఫీ కాలేదని చెప్పారు. రుణమాఫీ తర్వాత బ్యాంకులు వేగంగా రైతులకు కొత్త రుణాలు ఇవ్వాలని కోరారు. ఇప్పటివరకు రూ.18 వేల కోట్ల రుణాలను ప్రభుత్వం బ్యాంకులకు చెల్లిస్తే.. తిరిగి బ్యాంకులు రైతులకు రూ.10,400 కోట్లు మాత్రమే చెల్లించాయని వివరించారు.

2 లక్షల పైన రుణాలకు కటాఫ్ డేట్

మొదటిపేజీ తరువాయి...

చేస్తామని వివరించారు. ఈ నిబంధన ఎందుకు పెట్టారని మీడియా ప్రతినిధులు ప్రశ్నించగా, రైతులకు రుణమాఫీ తర్వాత మళ్లీ లోన్ రావాలంటే పూర్తిగా రుణం మాఫీ కావాల్సిన అవసరం ఉన్నదని చెప్పారు. అందుకే రూ.2 లక్షలకుపైగా ఉన్న రుణం రైతులు చెల్లిస్తే వారికి మొత్తం మాఫీ అయి, తర్వాత మళ్లీ రుణం వస్తుందని తెలిపారు. సాంకేతిక కారణాలతో రూ.2 లక్షల వరకు రుణం ఉన్న కొందరు రైతులకు రుణమాఫీ కాలేదని, వారికి కూడా పూర్తిస్థాయిలో మాఫీ చేస్తామని చెప్పారు. అర్హులైన ప్రతి రైతుకూ రుణమాఫీ చేసేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉన్నదని స్పష్టం చేశారు.

మా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డే

రేవంత్‌రెడ్డిని సీఎం కుర్చీ నుంచి దించేయాలని కొందరు ప్రయత్నిస్తున్నారని, ఇందుకోసం తనను, భట్టి విక్రమార్కను, ఉత్తమ్‌కుమార్‌రెడ్డిని సాకుగా చూపుతున్నారని పొంగులేటి పేర్కొన్నారు. కానీ, తమకు అన్ని విషయాలపై స్పష్టత ఉన్నదని, తమ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డే అని స్పష్టంచేశారు. రాష్ట్ర క్యాబినెట్‌కు సుతీ సన్నాయి లేదంటూ కేటీఆర్ చేసిన వ్యాఖ్యలకు ఆయన సమాధానమిచ్చారు. 'మా క్యాబినెట్‌కు ఏముందో మాకు తెలుసు.. మా క్యాబినెట్ ఎంత స్వేచ్ఛా వాతావరణంలో పనిచేస్తున్నదో మాకు తెలుసు. ఏ పవర్స్ ఉన్నాయో మాకు తెలుసు' అని పేర్కొన్నారు. తల తాకట్టు పెట్టయినా ఇచ్చిన హామీలను అమలు చేస్తామని చెప్పారు.

రేషన్‌కార్డులు, హెల్త్‌కార్డులు వేర్వేరుగా ఇస్తాం

తెల్ల రేషన్‌కార్డులకు సంబంధించి మంత్రులతో సబ్‌కమిటీ వేశామని, త్వరలోనే కార్డులు జారీ చేస్తామని మంత్రి పొంగులేటి వెల్లడించారు. ప్ర